క్లుప్తంగా

దళితులపై చిన్న చూపు



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

జమ్మికుంట: దళితులంటే ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డికి చిన్నచూపని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం హుజూరాబాద్ ఇన్‌చార్జి సాగర్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కొన్ని సమావేశాల్లో దళితులను దుర్భాషలాడిన సందర్భాలున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమం ఎక్కడా కనిపించని ఎమ్మెల్సీకి కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరేశ్, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి సతీశ్, మండల నాయకులు మొలుగూరి రాజేందర్, కొలుగురి రవీందర్, కదిరే శ్రీకాంత్, సంతోష్, శివ, రాహుల్, చందు, శివకృష్ణ, ఇంజం అనిల్, సది, మధు, తదితరులు పాల్గొన్నారు.

మేరా మిట్టి.. మేరా దేశ్



మట్టి సేకరిస్తున్న ప్రభాకర్ రావు వారసులు

తిమ్మాపూర్: ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా మేరా మిట్టి–మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు కామ్రేడ్ అణభేరి ప్రభాకర్ రావు స్వగ్రామం పొలంపల్లిలో శనివారం మట్టి సేకరించారు. ప్రభాకర్‌రావు వారసులు రావడంతో వారిని సన్మానించారు. ప్రభాకర్ రావు ఇంటిస్థలం నుంచి మట్టి సేకరించి ఢిల్లీలో నిర్మించనున్న అమరవీరుల స్తూపం నిర్మాణానికి మట్టిని తీసుకెళ్లనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి తెలిపారు. వారసురాలు సల్వాజీ వాసంతి, మధుసూదన్ రావు, పోస్టల్ శాఖ అధికారులు, గ్రామస్తులు శ్రీనివాస్, కుమార్, చంద్రమౌళి అంజిబాబు పోలు కొమురయ్య, సమ్మయ్య, సారయ్య, ఎల్లయ్య, కొమురయ్య, రాజయ్య, తదితురులు పాల్గొన్నారు.

వీధిదీపాల సమస్యపై కోర్టులో ఫిర్యాదు

గంగాధర: మండలంలోని చర్లపల్లి (ఆర్)లో వీధిదీపాల సమస్యపై గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఎట్టెపు కనుకయ్య కోర్టును ఆశ్రయించాడు. గ్రామంలో వీధిదీపాల సమస్యపై పలుసార్లు సర్పంచుతో పాటు, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించకపోవడంతో జిల్లా న్యాయ సేవాధికారికి ఫిర్యాదు చేశాడు. సేవాధికారి పీఎల్‌సీ నెంబర్ 2272/2023 ద్వారా కేసు నమోదు చేసి ప్రతివాదులుగా సర్పంచ్, కార్యదర్శి, ఎంపీడీవో చేర్చాడు. అక్టోబర్ 16న కోర్టుకు హాజరుకావాలని ఆదేశాలు జారీచేశారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

చొప్పదండి: పట్టణంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులపై ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పట్టణంలోని గుమ్లాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద చేపట్టిన డివైడర్ పనులను ఆమె శనివారం పరిశీలించారు. పట్టణంలో రూ. 32 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారన్నారు. అనంతరం డివైడర్ పనులను మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ పరిశీలించారు.

కాంగ్రెస్‌లో చేరిక

జమ్మికుంట: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్తురి సాగర్, లింగంపల్లి లింగారావు హైదరాబాద్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణ అధ్యక్షుడు వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జమ్మికుంట: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రవి, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్‌లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, సర్పంచ్ వసంత, కార్యదర్శి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి, కొత్తగట్టు గ్రామాల్లో వరి పంట పొలాలను కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి శనివారం పరిశీలించారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా ?

- ప్రమాదకరంగా కరీంనగర్ – రాయపట్నం రహదారి
- తరచూ ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పలుసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు



మరమ్మతు చేపట్టిన మూడు నెలలకే గుంతలుపడిన ప్రధాన రహదారి

చొప్పదండి: పట్టణంలోని కరీంనగర్, రాయపట్నం ప్రధాన రహదారి గుంతలమయమై రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మరమ్మతులు చేపట్టినా మూణ్నాళ్లకే గుంతలుపడి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. తరచూ రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

ద్విచక్రవాహనదారులే ఎక్కువ

పట్టణంలో ద్విచక్రవాహనదారులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. సెంట్రల్ లైటింగ్ పనులు నడుస్తున్న క్రమంలో రోడ్డుకిరువైపులా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాలతో రోడ్డు కుచించుకుపోతోంది. రోడ్డుపై మట్టిని సకాలంలో శుద్ధి చేయకపోవడం వాహనదారులకు దినదిన గండంగా మారింది. దీనికి తోడు కొన్నినెలలుగా పట్టణంలో గుంతలుపడ్డ ప్రధాన బీటీరోడ్డును మరమ్మతు చేయడం వదిలేశారు. సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో బీటీ మరమ్మతు చేయకపోగా ఏడాదిగా రోడ్డు ప్రమాదాలు పెరిగాయి.

అతివేగం.. త్రిబుల్ రైడింగ్..

పట్టణంలోని ప్రధాన రోడ్డుపై ప్రయాణిస్తున్న వారి వాహనాలపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో తోటి ప్రయాణికులకు శాపంగా మారింది. వేగంగా వెళ్లే వాహనదారులతో ఎదురుగా వస్తున్నవారు మృత్యువాత పడుతున్న సంఘటనలు నెలకొంటున్నాయి. మత్తు పదార్థాల వాడకంతో యువతలో స్పీడ్ లిమిట్ లేకపోవడం, త్రిబుల్ రైడింగ్, ఇరుకుగా మారిన రోడ్డు, అడ్డదిడ్డంగా పార్కింగ్, ప్రధాన రోడ్డును వ్యాపారులు తమ కార్యకలాపాలకు ఆక్రమించడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయి.

చర్యలు శూన్యం

పట్టణంలోని ప్రధాన రోడ్డుపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులు మృతిచెందుతున్నా ఆయాశాఖల అధికారుల్లో చలనం రావడం లేదు. సెట్‌బ్యాక్ స్థలం ఆక్రమిస్తున్నవారిపై మున్సిపల్ అధికారులు, రోడ్డు ఆక్రమిస్తున్న వారిపై ఆర్అండ్‌బీ అధికారులు, మత్తు పదార్థాల నివారణపై ఎక్సైజ్ అధికారులు దృష్టిసారించకపోవడంతో ప్రమాదాలకు అడ్డుకట్టపడటం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

తరుచూ ప్రమాదాలు

- పట్టణంలోని ఎస్‌బీఐ ముందు ఆర్అండ్‌బీ రోడ్డుపై జూన్ 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో మృతిచెందారు.
- సెప్టెంబర్ 9న అదే ఎస్‌బీఐ ఆఫీస్ ముందు బైక్ అదుపు తప్పి టిప్పర్‌ను ఢీకొన్న సంఘటనలో చికిత్స పొందుతూ పదిహేనేళ్ల యువకుడు మృత్యువాత పడ్డాడు.
- సెప్టెంబర్ 17న మర్లవాడ సమీపంలో ప్రధాన రహదారిపై వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న పంచాయతీ కార్యదర్శి మృతిచెందాడు.
- సెప్టెంబర్ 29న కాంట సమీపంలో రోడ్డుపై వెళ్తున్న బైక్ గుంతల మూలంగా అదుపుతప్పి కిందపడటంతో చికిత్స పొందుతూ ఓ వెల్డర్ మృతిచెందాడు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: ఏ పార్టీకి అయినా కార్యకర్తలే పునాది అని కార్యకర్తలకు వారికి అండగా ఉంటామని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మహాత్మా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొగిలిపాలెం, మహాత్మా నగర్, తిమ్మాపూర్, పొరండ్ల గ్రామాల నుంచి భారీగా పలు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, పార్టీలో చేరినవారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, నాయకులు రాజయ్య, రవీందర్, తిరుపతి రెడ్డి, అనిల్ గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాలకు సాగునీరు

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: మోతె రిజ్వాయర్‌కు బుదులు వరద కాలువ నుంచి నిర్మిస్తున్న కాలువల ద్వారా గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాలకు చెందిన వేలాది ఎకరాలకు సాగు నీరందుతుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. కాలువల నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండలంలోని నాగిరెడ్డిపూర్‌కి చెందిన భూనిర్వాసిత రైతులకు మంజూరైన రూ.25 కోట్ల విలువైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలోని భూ నిర్వాసిత రైతులకు ఎక్కువగా పరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

నియోజకవర్గం ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదించి అవకాశమిస్తే అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. ర్యాలపల్లిలో మాల, మాదిగ సంఘ భవనాలకు రూ.4లక్షలు, మహిళా సంఘం భవనానికి 4.60 లక్షల ప్రొసీడింగ్‌ను సంఘం నాయకులకు అందజేశారు. గ్రామానికి చెందిన రైతులు మెండె లక్ష్మీనారాయణ, పిట్టల రాములు మృతిచెదంగా బాధిత కుటుంబాలకు రైతుబీమా, ప్రొసీడింగ్‌లను అందజేశారు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

హుజూరాబాద్: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని హుజూరాబాద్ కబడ్డీ క్లబ్ కార్యదర్శి, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ముగింపు జరిగింది. 14 ఏళ్లలోపు బాల, బాలికలు 32 జట్లు హాజరుకాగా, బాలుర విభాగంలో మానకొండూర్ జట్టు ప్రథమ స్థానం, సైదాపూర్ జట్టు ద్వితీయ, బాలికల విభాగంలో సైదాపూర్ జట్టు ప్రథమ స్థానం, కరీంనగర్ అర్బన్ జట్టు ద్వితీయ స్థానంలో గెలుపొందాయి. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి , దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించిన కూడా తమ సహకారం అందిస్తామన్నారు. రిటైర్డ్ ఎంఈవో వీరస్వామి గౌడ్, ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పీడీ సొల్లు సారయ్య, ఎస్జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి నర్సయ్య, పీఈటీలు రవీందర్, రవికుమార్, భాగ్యలక్ష్మి, సౌజన్య, ప్రవీణ్ కుమార్, జ్యోతి, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్: సర్వాయి పాపన్న గుట్టలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మధువని గార్డెన్స్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అంతకుముందు సైదాపూర్ రోడ్డులో గల సర్వాయి పాపన్న విగ్రహానికి గౌడ సంఘం ప్రతినిధులు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం సైదాపూర్ క్రాస్ రోడ్డునుంచి కేసీ క్యాంపులోని ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు మైనింగ్ మాఫియా నుంచి పాపన్న గుట్టలను సంరక్షించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ నిర్మల, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి బుచ్చయ్య గౌడ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్తయ్య గౌడ్, రాజు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, నాయకులు సారయ్య గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి పంజాల రాము శంకర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి రమేశ్ గౌడ్, శ్రీపతి కుమార్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

జమ్మికుంట: పేదింటి ఆడబిడ్డలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట మున్సిపల్ పరిధి వార్డుల్లో అర్హులైన 30 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, తహసీల్దార్ రజని, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట : మండలంలోని సీతంపేట, వంతడ్పుల, మల్లన్నపల్లి, రాచపల్లి, చిన్నకోమటిపల్లి, గడ్డివానిపల్లి గ్రామాల్లోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీపీ పావని, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మానకొండూర్ రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి హెచ్ఎం పదోన్నతిపై సంతోష్‌కుమార్ బదిలీ అయ్యారు. కాలినడకన పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని 13 మందికి విద్యార్థులకు సైకిళ్లను కొనుగోలు చేశారు. హెచ్ఎం మధుకర్ చేతులమీదుగా సైకిళ్ల పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



విజయ్

హుజూరాబాద్ : బీజేపీ హుజూరాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన వొడ్నాల విజయ్‌ను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు శనివారం తెలిపారు. పట్టణ కార్యదర్శులుగా కొమురవెల్లి సంతోష్, భాషవేణి భాస్కర్ యాదవ్, పట్టణ కార్యవర్గ సభ్యుడిగా కొడిమ్యాల పవన్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. వీరి నియామకంపై ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రావుల వేణు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగిశెట్టి ప్రభాకర్, కౌన్సిలర్ పైళ్ల వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోతుల సంజీవ్, నాయకులు నల్ల సుమన్, అంకతి శ్రీనివాస్, యాళ్ల సంజీవరెడ్డి, తిప్పబత్తిని రాజు, యంసాని శశిధర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు గంట సంపత్, పలువురు హర్షం వ్యక్తంచేశారు.

అసైన్డ్ భూములకు పట్టాలు జారీచేయాలి



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

చిగురుమామిడి: గ్రామంలో దళితులకు సంబంధించిన అసైన్డ్ భూములకు పట్టాలు జారీచేయాలని దళితులు కోరారు. మండలంలోని ఓగులాపూర్‌లో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ బోయిని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దళితులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 55 మంది దళితులకు తలా రెండు నుంచి మూడు గుంటలవరకు 20 ఎకరాల వరకు భూమి ఉన్నా పట్టాలు లేవన్నారు. ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. దళితులపై వివక్ష చూపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సయ్య, మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్, ఆర్ఐ శైలజ, పీసీలు ప్రకాశ్, ఓదెలు, ఉప సర్పంచ్ కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్డీవో, తదితరులు హాజరయ్యారు.

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం

గన్నేరువరం: మండలంలోని గునుకుల కొండాపూర్‌లో ప్యాసింజర్ ఆటో శనివారం రాత్రి బోల్తాపడింది. జంగపల్లి నుంచి గుండ్లపల్లి స్టేజీ వైపు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు జేసీబీసాయంతో ఆటో బయటకు తీశారు. ఆటో డ్రైవర్ స్వల్ప బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

ఉపసర్పంచ్‌పై అవిశ్వాసం

తిమ్మాపూర్: మండలంలోని పర్లపల్లి ఉపసర్పంచ్ సుద్దాల రాజేశ్‌కుమార్ (8వ వార్డు)పై తొమ్మిది మంది వార్డు సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. గ్రామాభివృద్ధికి రాజేశ్‌కుమార్ అడ్డు పడుతున్నందుకే అవిశ్వాసం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాజేశ్ కుమార్‌ను తప్పించి నూతన ఉప సర్పంచ్‌ను ఎంపిక చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. గ్రామాభివృద్ధి కోసం త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో 12 మంది వార్డు సభ్యులు ఉండగా అవిశ్వాసంపై 9 మంది సంతకాలు చేసి ఆ కాపీని అధికారులకు పంపించారు.

సంక్షిప్త వార్తలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హుజూరాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల సూచించారు. శనివారం హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కౌన్సిలర్ ముక్క రమేశ్, కమిషనర్ సల్వాది సమ్మయ్య, ఇన్‌చార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ జి. సాంబరాజు, టీపీఎస్ అశ్విని గాంధీ, శానిటరీ జవాన్లు ప్రతాపరాజు, అనిల్, రమేశ్ , కార్యాలయ సిబ్బంది వినయ్, పారిశుద్ధ్య కార్మికులు, మెప్మా సీఎల్ఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చొప్పదండి: మండలంలోని వెదురుగట్టకు చెందిన బీజేపీ కార్యకర్త రాజు అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన శనివారం పరామర్శించి రూ. 15 వేల ఆర్థికసాయంగా అందజేశారు. ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

ఎంఐఎం దిష్టిబొమ్మ దహనం

వీణవంక: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎంఐఎం, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. ఎంపీ బండి సంజయ్, దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన ఎంఐఎం నాయకులను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నరేశ్, సమ్మయ్య, రాజు, వినోద్, గోపి శ్రీనివాస్, వీరస్వామి, రాజారాం ఉన్నారు.

హుజూరాబాద్ : ఎంపీ బండి సంజయ్ ఇంటి ముందు ఎంఐఎం నాయకులు ప్రవర్తించిన తీరుకు నిరసనగా శనివారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు ఎంఐఎం పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, జిల్లా అధికార ప్రతినిధి ముత్యం రావు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు విజయ్, దేవేందర్‌రావు, కార్యదర్శులు సంతోష్, భాస్కర్ యాదవ్, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండల బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్ –జగిత్యాల ప్రధాన రహదారిలోని మధురానగర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా

హుజూరాబాద్ : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక–శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల– శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కమిషనర్ సమ్మయ్య, కౌన్సిల్ సభ్యులు, వార్డుల ప్రత్యేక అధికారులు, సీఎల్ఆర్పీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సైదాపూర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కార్యాలయంపై ఎంఐఎం కార్యకర్తల దాడికి నిరసనగా శనివారం మండల బీజేపీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

హుజూరాబాద్ : ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్మికులు కమిషనర్ సమ్మయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు.

అధికారులు ప్రజాభిమానం పొందాలి

మానకొండూర్: అధికారుల విధి నిర్వహణలో ప్రజాభిమానం పొందాలని ఎంపీపీ ముద్దసాని సులోచన అన్నారు. మానకొండూర్ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన దివ్యదర్శన్‌రావు ఇటీవల కరీంనగర్‌కు బదిలీ కాగా శనివారం కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జమ్మికుంట: పట్టణంలోని అప్కో మాజీ డైరెక్టర్, చతరంజి సహకార సంఘం మాజీ అధ్యక్షుడు దాసరి మల్లయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మధ్యప్రదేశ్ కలెక్టర్ పరికిపడ్ల నరహరి (ప్రిన్సిపల్ సెక్రెటరీ) శనివారం రాత్రి పరామర్శించారు. అనంతరం చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆలయ ఫౌండేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుణసాగర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి రామారావు, ఎండీ పాషా ఉన్నారు.

ఆహ్వాన పత్రం అందజేత



తనికెళ్ల భరణికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట మానసా దేవి ఆలయంలో నిర్వహించే శ్రీ చక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనాలని సినీ యాక్టర్ తనికెళ్ల భరణిని హైదరాబాద్‌లోని వారి నివాసంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు కలిసి మహోత్సవ ఆహ్వాన పత్రం అందజేశారు. అక్టోబర్ 18 నుంచి 20వ తేదీ వరకు శ్రీ చక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ, డైరెక్టర్ సందవేని లక్ష్మణ్, సాయిని తిరుపతి పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని నిరసన



బైఠాయించిన సర్పంచ్

మానకొండూర్‌రూరల్: గ్రామంలో అభివృద్ధి పనులు చేసి నెలలు గడుస్తున్నా అధికారులు బిల్లులు చెల్లించడం లేదంటూ మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్ శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, తాను అప్పు చేసి గ్రామంలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, వివిధ సంఘ భవనాలు, శ్మశానవాటిక ప్రహరీ తదితర అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. బిల్లులు మాత్రం చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటి వరకు 1 కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేశానని, సదరు పనులకు రూ.65 లక్షల ఎంబీ రికార్డులు చేసి, ఇంకా రూ.75 లక్షల వరకు ఎంబీ రికార్డులు చేయలేదని ఆరోపించారు. నిధులు లేవని, ఫ్రీజింగ్, సమ్మె ఉందని పంచాయతీరాజ్ అధికారులు నాన్చుడి ధోరణి అవలంబిస్తున్నారని అన్నారు. కమీషన్ల కోసమే అధికారులు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశాడు. సర్పంచ్‌కు సీఐ రాజ్‌కుమార్ నచ్చజెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎమ్మెల్యే 'వొడితెల' జన్మదిన వేడుకలు

చిగురుమామిడి: హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం మినీ బస్టాండ్ ఆవరణలో ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు కమిటీ సభ్యుడు సాంబారి కొమురయ్య, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, హుస్నాబాద్ మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షురాలు రామోజు రజిత, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కె మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రామోజు కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ జన్మదిన వేడుకలను మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం హుస్నాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి తరలివెళ్లారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో..

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో వొడితెల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రెటరీ, వొడితెల సతీశ్‌కుమార్ జన్మదిన వేడుకలను కాలేజీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు ఇందనీల్ కేక్ కట్‌చేశారు. అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గడువులోగా రెన్యువల్ చేసుకోవాలి

హుజూరాబాద్: కార్మికశాఖ ద్వారా లేబర్‌కార్డులు పొందిన కార్మికులు గడువులోగా కార్డులను రెన్యువల్ చేసుకోవాలని హుజూరాబాద్ సహాయ కార్మిక శాఖ అధికారి చందన అన్నారు. శనివారం కార్మిక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంతోమంది కార్మికులు కూతుళ్ల పెళ్లి కానుకలు, ప్రసూతి లబ్ధి, సహజ మరణాలు, ప్రమాదవశాత్తు మృతిచెందిన వారి కుటుంబాలు శాఖ ద్వారా లబ్ధి పొందారన్నారు. కరీంనగర్ రోడ్డులో ఉన్న కార్మికశాఖ కార్యాలయాన్ని పట్టణంలోని మున్సిపాలిటీ రోడ్డులో రామలింగారెడ్డి ఆస్పత్రికి ఎదురుగా 19–13 నంబర్ ఇంట్లోకి మార్చినట్లు తెలిపారు. కార్మికులు గమనించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

గన్నేరువరం: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం మధ్యాహ్న భోజన వంట కార్మికులు మండలకేంద్రంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, నాయకులు సాగర్‌రెడ్డి, శ్రీనివాస్, బోయిని మల్లయ్య, కూన మల్లయ్య, ఆంజనేయులు, సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు రాస్తారోకో చేశారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుచ్చన్న యాదవ్ అన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్–వరంగల్ రహదారిపై రాస్తారోకో చేశారు. మండల కార్యదర్శి సమ్మయ్య, రజిత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.